క్లుప్తంగా

మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం



గంగారం: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేందుకే మక్క కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తహసీల్దార్ రాము అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు క్వింటాల్ రూ. 2090 చెల్లిస్తుందన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు అందని అల్పాహారం అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురుమైంది. దీంతో పాఠశాల వంట నిర్వాహకులతో విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మాట్లాడి విద్యార్థులకు తప్పనిసరిగా ప్రతి రోజు ఉదయం అల్పాహారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు శుక్రవారం ఉదయం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వంట నిర్వాహకులు విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు.

ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా పర్శ్యా



గార్ల: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా గంగావత్ పర్శ్యాను నియమిస్తూ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవికుమార్ శుక్రవారం నియామక పత్రం అందజేశాడు.

మిరపతోటల పరిశీలన



దోర్నకల్: మండలంలోని జోగ్యాతండా, పెరుమాళ్లసంకీస గ్రామాల పరిధిలో ఎస్సారెస్పీ నీటి ప్రవాహంతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి అవినాష్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న వేర్వేరుగా పరిశీలించారు. నాయిని మంగమ్మ, నాయిని లింగరాజుకు చెందిన మిరపతోటలోకి వరద నీరు ప్రవహించడంతో మిరప చెట్లు వరదలో కొట్టుకుపోయాయి. వరదతో మిరపతోటలు దెబ్బతిన్న రైతులకు రూ.5లక్షల పరిహారం అందించాలని శెట్టి వెంకన్న డిమాండ్ చేశారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గూడూరు: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై రాణాప్రతాప్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం రాత్రి గూడూరులో నిర్వహించిన బీజేపీ ప్రజా ఆశీర్వాద యాత్ర బహిరంగ సభలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ప్రతినిధులు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రథయాత్ర విజయవంతం కోసం ప్రచారం

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంద కృష్ణ మాదిగ చేపట్టిన రథయాత్రను విజయవంతం చేయాలని ఎంఎస్పీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎండి.రజియా, జిల్లా నాయకులు కందిపాటి భిక్షపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని సిగ్నల్, మంద కొమురమ్మనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తూ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 4వ తేదీన మానుకోటకు మంద కృష్ణ మాదిగ రచేపట్టిన రథయాత్ర వస్తున్న సందర్భంగా మాదిగలు, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 18న లక్షమందిలో సభ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రవీణ్, సమ్మయ్య, యాకుబ్, రేణుక పాల్గొన్నారు.

పాపన్న విగ్రహ కమిటీ ఎన్నిక

నెక్కొండ: మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఎన్నిక జరిగినట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు గిరగాని శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం నూతన కమిటీ అధ్యక్షుడిగా కారింగుల సురేష్, ఉపాధ్యక్షుడిగా గడ్డం ఆనందం, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపెల్లి చెన్నకేశవులు, కోశాధికారిగా గడ్డం ముఖ్య సలహాదారులుగా కక్కెర్ల నాగయ్య, కదురు సాంబయ్య, గడ్డం శ్రీనివాస్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న వీరోచిత పోరాటాలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో త్వరలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కమిటీ సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఐదేళ్లు బాధపడ్డం

● ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్



నెల్లికుదురు: బంజర గ్రామంలో ప్రచారం చేస్తున్న శంకర్‌నాయక్



గార్ల: ప్రచారం చేస్తున్న హరిప్రియ, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు

నెల్లికుదురు: వెన్నెముక లేని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఐదేళ్లు బాధపడాల్సి వస్తదని, కళ్ల ముందే అభివృద్ధి చేసి చూపెడుతున్న కేసీఆర్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మహబూబాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్ నాయక్ ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బంజర, శ్రీరామగిరి, మధనతుర్తి, రావిరాల, వస్రాం తండా, దుర్గాభవాణి తండాలో శుక్రవారం ఎన్నిల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన కేసీఆర్ కారుగుర్తుకు ఓటు వేసి మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ మాధవి, విజయ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, రమేష్, లక్ష్మి చంద్ర శేఖరరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

మహబూబాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శరత్, శ్రీనివాస్, జగన్, మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి

కేసముద్రం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల శివకుమార్, కోఆప్షన్ మెంబర్ నజీర్, రఫీ, ముల్క మురళీ, పురుషోత్తం పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

గార్ల: 5ఏళ్లుగా మండలంలో చేసిన అభివృద్ధి పనులను చూసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియ, జెడ్పీ చైర్మన్ అంగోత్ బిందు కోరారు. శుక్రవారం మండలంలోని పుల్లూరు, పోచారం, రాజుతండా, బీఆర్ఎస్‌తండా, కోట్యానాయక్ తండాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని కోట్యానాయక్ తండాలో హరిప్రియను తండావాసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఉమేష్, ఎంపీపీ శివాజీచౌహాన్, ఎంపీటీసీలు రమేష్, మంజుల, కోఆప్షన్ ఖదీర్ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రెడ్యానాయక్ గెలుపు ఖాయం

దోర్నకల్: దోర్నకల్ నియోజకవర్గ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ తెలిపారు. మండలంలోని 15గ్రామ పంచాయతీలలో శుక్రవారం పర్యటించి పార్టీ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలునాయక్, పీఏసీఎస్ చైర్మన్ భిక్షంరెడ్డి ఎంపీటీసీ సభ్యులు శంకర్‌నాయక్, సర్పంచ్ రాంబాయిమంగీలాల్, నాయకులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రెడ్యానాయక్ గెలుపు ఖాయమని జిల్లా రైతు సమన్వయ సభ్యులు జర్పుల కాలునాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ మండలం బాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రచారం నిర్వహించారు.

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష

కురవి: కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష అని, డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అఖండ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రాజోలు గ్రామంలో బీఆర్ఎస్ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ మస్తాన్, ఈడిగపల్లి వీరేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మోదీ పథకాలతోనే రాష్ట్రం అభివృద్ధి

● బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి హుస్సేన్ నాయక్



నెల్లికుదురు: ప్రచారం చేస్తున్న హుస్సేన్‌నాయక్



తొర్రూరు రూరల్: గుర్తూరులో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

నెల్లికుదురు: ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న పథకాలతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మహబూబాబాద్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారం గ్రామంలో పల్లె పల్లెకు బీజేపీ ఇంటింటికి హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్రలో హుస్సేన్ నాయక్ పర్యటించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధి జరగలేదన్నారు. కేసీఆర్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తు బీజేపీకి ఓటు వేసి గెలిపించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

మానుకోటలో బీజేపీ గెలుపు ఖాయం

గూడూరు: హుస్సేన్‌నాయక్ గెలుపు ఖాయమని గూడూరులో జరిగిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో ప్రజలు తేల్చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, మోదీన్‌నాయక్, నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలి

తొర్రూరు రూరల్: బీజేపీకి ఒక్కసారి అవకాశం కల్పించాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లేగ రామ్మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని గుర్తూరు, అమ్మాపురం, ఖానాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీమాన్, రచ్చ కుమార్, శంకర్, రాజశేఖర్‌గౌడ్, రవిబాబు, సురేష్, సోమన్న, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం

గార్ల: రాష్ట్రంలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని ఇల్లందు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్ర నాయక్ అన్నారు. శుక్రవారం గార్లలో ఆయన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి విమల్‌కుమార్ జైన్, మండల అధ్యక్షుడు జశ్వంత్‌ఠాకూర్, నియోజకవర్గ కన్వీనర్ గోపికృష్ణ, నాగరాజు, శ్రీను, రాము, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

బయ్యారం: బీజేపీ ఎన్నికల కార్యాలయంను శుక్రవారం బయ్యారంలో పార్టీ ఇల్లందు నియోజకవర్గ అభ్యర్థి రవీందర్‌నాయక్ ప్రారంభించాడు. కార్యక్రమంలో పార్టీ భద్రాద్రి జిల్లా కన్వీనర్ సోమసుందర్, నియోజకవర్గ కన్వీనర్ గోపికృష్ణ, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీజేవైఎం మండల అధ్యక్షుడు నరేష్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా..

దంతాలపల్లి: మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో డోర్నకల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య సంగీత శుక్రవారం గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి, అనంతరం ఇంటింటా బొట్టు పెట్టి ప్రచారం నిర్వహించారు. గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేసముద్రం: హైదరాబాద్‌లో ఈనెల 11న నిర్వహించనున్న విశ్వరూప మహాసభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంటిపుడి అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వల గ్రామంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద చలో హైదరాబాద్ విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ.. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టే సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బిర్రు యుగేందర్, కందిపాటి విజయేందర్, కందిపాటి శ్యాం, ఉపేందర్, జల్లె ఉప్పలయ్య, బూర యాదయ్య, ప్రవీణ్, సోమయ్య పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని అయోధ్య, సింగారం గ్రామాల నుంచి ముదిరాజ్ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారని మండల అధ్యక్షుడు పసుపులేటి నవీన్ నాయుడు శుక్రవారం తెలిపాడు.

మోకుదెబ్బ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రాధిక

నెక్కొండ: మండల కేంద్రానికి చెందిన కక్కెర్ల రాధికను సర్వాయి పాపన్న మోకుదెబ్బ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కక్కెర్ల నాగయ్య తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఆమెను నియమించినట్లు తెలిపారు. అనంతరం ఆమెకు నియామక పత్రం అందించగా పలువురు అభినందించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. గీతాకార్మికుల సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్పీతోనే బడుగులకు గుర్తింపు



మహబూబాబాద్ అర్బన్: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న శేఖర్ నాయక్



మరిపెడ రూరల్: చింతలగడ్డతండాలో బీఎస్పీలో చేరిన వారితో పార్వతి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రజలు అవకాశం ఇస్తే మానుకోటను చదువుల కోటగా మారుస్తానని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి గుగులోత్ శేఖర్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హన్మంతునిగడ్డలో శుక్రవారం ఇంటింటికి తిరికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉపేందర్, కోశాధికారి క్రిష్ణ, ఈసీ సభ్యులు చాణిక్య, అసెంబ్లీ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి కిరణ్, పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: బీఎస్పీ పార్టీతోనే బహుజనులకు రాజ్యాధికారం దక్కడంతోపాటు సరియైన న్యాయం జరుగుతుందని బీఎస్పీ డోర్నకల్ నియోజక వర్గ అభ్యర్థి గుగులోతు పార్వతి అన్నారు. మండలంలోని చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఎస్పీ మండల మహిళా కన్వీనర్ దారావత్ భారతి ఆధ్వర్యంలో బీఎస్పీ పార్టీలో శుక్రవారం చేరారు. పార్వతి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి పరశురాములు, నాయకులు జినక సువార్త, జినక కృష్ణమూర్తి, భాను, నితిన్‌నాయక్ పాల్గొన్నారు.

బయ్యారం: రానున్న ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించటం ద్వారానే బడుగు, బలహీనవర్గాలకు గుర్తింపు వస్తుందని బీఎస్పీ ఇల్లందు నియోజకవర్గ అభ్యర్థి బి.ప్రతాప్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన బయ్యారంలో పర్యటించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

గంగారం: ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారం అందించాలని సీపీఐ(ఎంఎల్) గంగారం, కొత్తగూడ సంయుక్త మండల కార్యదర్శి పూనెం ప్రభాకర్ అన్నారు. గంగారం మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 12 గ్రామపంచాయతీలలో రైతాంగం సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు ఎండిపోతున్నాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సర్వే నిర్వహించి ఎకరానికి ఆహార పంటలకు రూ. 25వేలు, వాణిజ్య పంటలకు రూ. 30వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు ఈక భిక్షం, రంగయ్య, జోగరాములు, కంగాల పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు నాయకుల చేరిక



పెద్దవంగర: ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

పెద్దవంగర: బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ వార్డు మెంబర్ కనుకుంట్ల నరేష్‌తోపాటు యూత్ నాయకులు రాంపెల్లి హరీశ్, సుదగాని శ్రీకాంత్, అశోక్‌లు బీఆర్ఎస్‌లో మంత్రి సమక్షంలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. దశాబ్దాలుగా తెలంగాణను విస్మరించిన కాంగ్రెస్ పాలకులు ఈ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఇస్తున్న హామీలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని చూసే ప్రజలు పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు.

కొత్తగూడ: ఎన్నికల తర్వాత ఆరునెలల్లో గిరిజనేతరుల పోడు భూములకు పట్టాలు ఇస్తామని రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని వేలుబెల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం వేలుబెల్లి వార్డు సభ్యుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. గంగారం మండలం నుంచి భారీగా బీఆర్ఎస్ చేరారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ దేశిడి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మోకాళ్ల సంతోషారాణి, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ కోసం అవగాహన సదుస్సు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రాధిక రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నచిన్న విషయాలకు తొందరపడవద్దని, మానసికంగా కుంగిపోవద్దన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఒక నిమిషానికి ఆత్మహత్యల ద్వారా ఒక వ్యక్తి మృతిచెందుతున్నాడని తెలిపారు. విద్యార్థుల ఆటపాటల ద్వారా మానసికంగా దృఢంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ప్రసాద్, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాక్కుల సందానందం, వీరేందర్ పాల్గొన్నారు.

అండగా ఉండే వారికి సీపీఐ మద్దతు



మాట్లాడుతున్న నల్లు సుధాకర్‌రెడ్డి

కురవి: కురవి శివారులో ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను క్రమబద్ధీకరించి కాలనీ అభివృద్ధికి అండగా ఉండే పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతు ఇస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుడిసెవాసుల కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని తెలిపారు. పేదలు వేసుకున్న గుడిసెవాసులకు అండగా ఉన్నోళ్లకే మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కర్నం రాజన్న, పోగుల శ్రీనివాస్, కన్నె వెంకన్న, దైద నితిన్, కురాకుల వీరన్న, గుట్టయ్య, కొప్పుల హేమలత, నక్క ఉమ, అచ్చమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కరపత్రాల ఆవిష్కరణ

మరిపెడ రూరల్: డోర్నకల్ నియోజక వర్గం ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ గెలుపు కోసం మరిపెడ మండలం దంటకుంటతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బొడ్రాయి వద్ద బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను సర్పంచ్ గుగులోతు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు భూక్య ప్రవీణ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ప్రచార రథానికి పూజలు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార రథానికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలుచేసి, ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, నాయకులు బాబురావు, రాజేందర్‌రెడ్డి, శ్యామ్, వెంకన్న, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్

మహబూబాబాద్ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ కేసుల్లో ఉన్న 46 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీష్ శుక్రవారం తెలిపాడు.

ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడి మృతి



కృష్ణారావు (ఫైల్)

దోర్నకల్: ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు సుంకు కృష్ణారావు (74) శుక్రవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందాడు. కృష్ణారావుకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

జిల్లా కార్యదర్శులకు సన్మానం

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులుగా నియామకమైన ప్రవీణ్‌నాయక్, వీరారెడ్డిలను పార్టీ నాయకులు శుక్రవారం బయ్యారంలోని పొంగులేటి, కోరం క్యాంపు కార్యాలయం వద్ద శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీను, రమేష్, సుమన్, అరుణ్, రాంమూర్తి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా సమ్మక్క

కొత్తగూడ: ములుగు ఎమ్మెల్యే బరిలో సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ నిలుస్తుందని పార్టీ జిల్లా నాయకుడు గౌని అయిలయ్య ప్రకటించాడు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ములుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగారం మండలకేంద్రానికి చెందిన వజ్జ సమ్మక్కను పార్టీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు శ్రీశైలం, బూర్క వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం, వేములపల్లి గ్రామాలలో మిరప పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించినట్లు వ్యవసాయ విస్తరణ అధికారి దీక్షిత్ శక్రవారం తెలిపాడు. ఈ సందర్భంగా మిరప పంటలలో ఆకుముడత తెగులు (జెమిని) వైరస్‌ను గుర్తించారు. వైరస్ నివారణకు రైతులకు సూచనలు ఇచ్చారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

గూడూరు: మండలంలోని తేజావత్‌రాంసింగ్‌తండాకు చెందిన సీనియర్ నాయకుడు బోడ శంకర్ నాయక్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశాడు.

దివ్యాంగుల సంక్షేమం మరిచిన పార్టీలు




కురవి: ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగుల సమస్యలను పార్టీలు మరచిపోయాయని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో మతతత్వ పార్టీలను ఓడించాలన్నారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో మల్లికార్జున్, సారయ్యగౌరమ్మ, యాకయ్య, మణెమ్మ, పద్మ, బత్తిని వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



గూడూరు: మండలంలోని గోవిందాపురంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవపెద్ది ప్రదీప్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రమేష్‌చందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 50 కుటుంబాల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు చిట్టె వెంకన్న, బొల్లికొండ మధుగౌడ్, ఎడ్ల నరేష్‌రెడ్డి, అర్రెం వీరస్వామి, వాంకుడోతు కొమ్మాలు, హెచ్ శివ, మూడు వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

గుండె నొప్పితో సర్పంచ్ మృతి





వెంకన్నగౌడ్ (ఫైల్)

గూడూరు: మండలంలోని పొనుగోడు టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందిన సర్పంచ్ నలమాస వెంకన్నగౌడ్ (56) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని గురువారం రాత్రి ఇంటికి వెళ్లిన వెంకన్నగౌడ్‌కు గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు గూడూరులోని సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్ నాయక్ సంతాపం తెలిపాడు. మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోతు కవిత పొనుగోడు చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.